క్లుప్తంగా

చలివేంద్రం ప్రారంభం



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే తనయుడు కేతిరెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి

తాడిపత్రి టౌన్: పట్టణంలోని అంబేడ్కర్ సర్కిల్‌లో ఎంపీటీసీ రవికుమార్, వైఎస్సార్‌సీపీ నాయకుడు ప్రదీప్‌రెడ్డి ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని శనివారం ఎమ్మెల్యే పెద్దారెడ్డి తనయుడు కేతిరెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

'రోటరీ' సేవలు ప్రశంసనీయం



మజ్జిగ చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న సీఐ రామసుబ్బయ్య

గుంతకల్లుటౌన్: సమాజహితం కోసం రోటరీ సంస్థ నిర్వహిస్తున్న సేవలు అభినందనీయమని గుంతకల్లు వన్‌టౌన్ సీఐ రామసుబ్బయ్య అన్నారు. వేసవికాలంలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు డీఎంఎం గేట్ వద్ద రోటరీక్లబ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మజ్జిగ చలివేంద్రాన్ని సీఐ ప్రారంభించారు. కార్యక్రమంలో రోటరీక్లబ్ అధ్యక్షుడు వంకదారు ప్రదీప్, కార్యదర్శి డిష్‌రాము, రొటేరియన్లు శ్రీకాంత్, వీఎల్.గుప్త, అనురాధ గుప్త తదితరులు పాల్గొన్నారు.

బైక్ అదుపు తప్పి యువతికి గాయాలు



ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన బెంగుళూరు యువతి అంబిక

గుత్తి/రూరల్: మండలంలోని బసినేపల్లి శివారులో జిల్లా సరిహద్దు బాట తండా వద్ద శనివారం ద్విచక్రవాహనం అదుపు తప్పి బోల్తా పడి అంబిక అనే యువతి తీవ్రంగా గాయపడింది. పోలీసుల వివరాల మేరకు.. బెంగళూరుకు చెందిన అంబిక అనే యువతి స్నేహితుడితో కలిసి మంత్రాలయం వెళ్లింది. స్వామి దర్శనానంతరం బెంగళూరుకు వెళ్తుండగా బసినేపల్లి గ్రామ శివారులో తుగ్గలి మండలం బాట తండా సమీపంలో బైక్ అదుపు తప్పి బోల్తా పడింది. ప్రమాదంలో కాలు విరిగి తీవ్రంగా గాయపడ్డ యువతిని వెంటనే చికిత్స నిమిత్తం గుత్తి ఆస్పత్రికి తరలించారు. వైద్యుల సూచన మేరకు అనంతపురానికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

టి.కొత్తపల్లిలో చోరీ



చంద్ర ఇంట్లోని బీరువాలో చిందర వందరగా పడేసిన వస్తువులు

గుత్తి రూరల్: మండలంలోని టి.కొత్తపల్లిలో శుక్రవారం అర్ధరాత్రి దొంగలు రెచ్చిపోయారు. తాళాలు వేసిన రెండిళ్లలో చోరీకి పాల్పడటంతో పాటుగా ఓ ద్విచక్రవాహనం అపహరించారు. గ్రామానికి చెందిన చంద్ర, నాగరాజు ఇంటికి తాళం వేసి డాబా పైన నిద్రించారు. అయితే దొంగలు అర్ధరాత్రి ఇంటి తాళాలు బద్దలు కొట్టి నాగరాజు ఇంట్లో రూ.20 వేల నగదు, నాలుగు జతల కమ్మలు, చంద్ర ఇంట్లో రూ.40 వేల నగదు, రెండు జతల కమ్మలు, ఉంగరం చోరీ చేశారు. అదే విధంగా గ్రామానికి చెందిన ఓబులేసు అనే వ్యక్తి ద్విచక్రవాహనం అపహరించారు. బాధితుల ఫిర్యాదు మేరకు సీఐ వెంకటరామిరెడ్డి, ఎస్‌ఐ శ్రీనివాసులు శనివారం సంఘటన స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గుండె పోటుతో వైఎస్సార్‌సీపీ కార్యకర్త మృతి



చిల్లు వెంకట నారాయణ (ఫైల్)

పుట్లూరు: మండలంలోని కడవకల్లుకు చెందిన వైఎస్సార్ సీపీ కార్యకర్త చిల్లు వెంకట నారాయణ (62) గుండెపోటుతో శనివారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న వైఎస్సార్ సీపీ నాయకులు సంతాపం తెలియజేశారు.

భక్తిశ్రద్ధలతో రంజాన్ వేడుకలు



గుంతకల్లు టౌన్: ముస్లింలకు శుభాకాంక్షలు తెలుపుతున్న ఎమ్మెల్యే వైవీఆర్



తాడిపత్రి: కొత్త ఈద్గాలో ప్రార్థనల్లో పాల్గొన్న ముస్లింలు



శింగనమల: ఈద్గాలో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు



గుంతకల్లు టౌన్: ఈద్గా మైదానంలో ప్రార్థనలు నిర్వహిస్తున్న ముస్లింలు

గుంతకల్లు టౌన్: రంజాన్ పండుగను ముస్లింలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. శనివారం ఉదయం ముస్లింలతో పట్టణంలోని ఈద్గా మైదానాలు, మసీదులు నిండిపోయాయి. ఎస్‌జేపీ హైస్కూల్ వద్ద నున్న ఈద్గా మైదానం నందు పట్టణ ప్రభుత్వ ఖాజీ సయ్యద్ అబ్దుల్ రజాక్ పీర్ ఖాద్రీ ఈదుల్ ఫితర్ ప్రార్థనలు నిర్వహించారు. ముస్లింలందరికీ ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి రంజాన్ శుభాకాంక్షలను తెలియజేస్తూ లేఖ పంపినట్లు ఖాజీ పేర్కొన్నారు. ప్రార్థనల అనంతరం ముస్లీం సోదరులు ప్రభుత్వ ఖాజీ సయ్యద్ రజాక్ ఖాద్రీ ఆశీర్వాదం పొందారు. ఒకరినొకరు ఆలింగనం చేసుకుని రంజాన్ శుభాకాంక్షలు చెప్పుకున్నారు. పాతగుంతకల్లు, ఎఫ్‌సీఐ గోడౌన్‌ల వద్దనున్న ఈద్గా మైదానాల్లో కూడా ప్రార్థనలు జరిగాయి. వక్ఫ్ బోర్డు జిల్లా ఉపాధ్యక్షుడు అహ్మద్‌బాష, మైనార్టీ కౌన్సిలర్లు, కోఆప్షన్‌సభ్యులు, మతగురువులు, పెద్దలు, ముస్లింలు పాల్గొన్నారు.

రంజాన్ శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే

రంజాన్ పండుగ సందర్భంగా ముస్లింలకు ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి, వైస్ ఛైర్‌పర్సన్ నైరుతిరెడ్డి, సీబీమంజునాథరెడ్డి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ముస్లింలు ఎమ్మెల్యే వైవీఆర్‌ను శాలువాతో సన్మానించి స్వీట్‌బాక్స్‌లను అందజేశారు. కార్యక్రమంలో మైనార్టీ కౌన్సిలర్లు, కోఆప్షన్‌సభ్యులు, వివిధ అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గుత్తి: గుత్తి, గుత్తి ఆర్‌ఎస్‌లతో పాటు మున్సిపాలిటీ వ్యాప్తంగా శనివారం రంజాన్ వేడుకలను ముస్లిములు ఎంతో పవిత్రంగా , ఘనంగా నిర్వహించారు. అలాగే పట్టణంలోని ఈద్గా మైదానాన్ని పరిశుభ్రం చేయడంతో పాటు ప్రహరీ నిర్మించిన వైఎస్సార్ సీపీ నాయకులను ముస్లిం మత పెద్దలు శనివారం సన్మానించారు. వైఎస్సార్ సీపీ పట్టణ కన్వీనర్ పీరా, జిల్లా నాయకులు వన్నూర్ సాబ్, మైనుద్దిన్, షఫి, మత పెద్దలు పాల్గొన్నారు.

గుత్తి రూరల్: మండల వ్యాప్తంగా ముస్లింలు రంజాన్ పండగను ఘనంగా జరుపుకున్నారు. ఈద్గాల్లో నమాజు అనంతరం ముస్లింలు ఈద్ ముబారక్ చెప్పుకొని ఒకరికొకరు పరస్పరం ఆలింగనం చేసుకున్నారు.

పామిడి: పట్టణంలోని నూతన ఈద్గాలో శనివారం ముస్లింలు భక్తిశ్రద్ధలతో రంజాన్ పండుగను ఆచరించారు, గుంతకలు ఎమ్మెల్యే స్థానిక ఈద్గా వద్ద ముస్లింలకు పవిత్ర రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. అలాగే స్థానిక కాగితాలవీధిలోని ఏఎస్‌ఐ దివంగత ఘనీ ఇంట్లో రంజాన్ విందులో రాయదుర్గం ఎమ్మెల్యే కాపు రామచంద్రారెడ్డి పాల్గొని, ముస్లింలకు శుభాకాంక్షలు తెలిపారు.

ముస్లింల ర్యాలీ

శింగనమల/నార్పల/యల్లనూరు/ పుట్లూరు/ గార్లదిన్నె/ బుక్కరాయసముద్రం: శింగనమల, నార్పల, గార్లదిన్నె, యల్లనూరు, పుట్లూరు, బుక్కరాయసముద్రం మండలాల్లో శనివారం రంజాన్ పండుగను ముస్లింలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. శింగనమలలో ఉదయం 8 గంటలకు అసార కట్ట నుంచి చెరువు వరకు ముస్లింలు ర్యాలీగా వెళ్లారు. అక్కడ 10 గంటల వరకు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం ఒకరికొకరు అలింగనం చేసుకుని, శుభాకాంక్షలు తెలుపుకున్నారు. మండలంలోని పెరవలి, తరిమెల, ఆకులేడు గ్రామాల్లోని ఈద్గాలో ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు.నార్పల మండల వ్యాప్తంగా శనివారం రంజాన్ వేడుకలు వైభవంగా జరిగాయి. మండల కేంద్రంలోని జామీయ మసీదు నుంచి ఈద్గా మైదానం వరకు ముస్లింలు పెద్ద ఎత్తున ఊరేగింపుగా చేరుకొని ప్రార్థనలు చేశారు. యల్లనూరు మండల వ్యాప్తంగా రంజాన్ వేడుకలను ముస్లింలు ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలోని పాతపేట, అచ్చుకట్లవీధి, కోడిముర్తి రోడ్డుతో పాటు వెన్నపూసపల్లి, తిమ్మంపల్లి, సింగవరం, చింతకాయమంద, గొడ్డుమర్రి తదితర గ్రామాల్లో రంజాన్ వేడుకలు జరిపారు. పుట్లూరు మండలంలోని గాండ్లపాడు, చెర్లోపల్లి, సూరేపల్లి, కోమటికుంట్ల తదితర గ్రామల్లో ఈద్గాల వద్ద ప్రార్థనలు చేపట్టారు. గార్లదిన్నె మండల కేంద్రం తోపాటు మర్తాడు, కల్లూరు, యర్రగుంట్ల పలు గ్రామాల్లో శనివారం పవిత్ర రంజాన్ పండుగను ముస్లింలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. గ్రామాల్లో ముస్లింలు నూతన వస్త్రాలు ధరించి ఉత్సాహంగా ఈద్గా, మసీద్‌లలో ప్రత్యేక ప్రార్థలు నిర్వహించారు.

బుక్కరాయసముద్రం: మండలంలో ముస్లింలు శనివారం రంజాన్ వేడుకలను భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ముస్లింలు ప్రత్యేక నమాజ్ చదివి అనంతరం ఒకరినొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. కార్యక్రమంలో మత పెద్దలు జావిద్ హుసేన్, యక్‌బాల్ సాహెబ్, మహమ్మద్ అలీ, నబీరసూల్, పాన్‌బాషా, జిల్లాన్ అన్సర్, బాషా, బాబావలి, హుసేన్‌వలి పాల్గొన్నారు.

ఘనంగా ఈదు ఉల్ ఫితర్

తాడిపత్రి టౌన్: పట్టణంలో శనివారం రంజాన్ వేడుకలు ఘనంగా జరిగాయి. ముస్లింలు ఉదయమే ఈద్గాలు, మసీదులు, దర్గాలకు వెళ్లి ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. పట్టణంలోని సంజీవనగర్‌లోని కొత్త ఈద్గా, మున్సిపల్ కార్యాలయం సమీపంలోని పాత ఈద్గాలతో పాటు సిద్దిబాషా దర్గాతో పాటు అన్ని మసీదుల్లో ప్రార్థలు జరిగాయి.

పెద్దవడుగూరు: మండల వ్యాప్తంగా రంజాన్ వేడుకలు ఘనంగా జరిగాయి. పెద్దవడుగూరులోని మసీద్ వద్దకు ముస్లింలు పెద్ద ఎత్తున ఉదయమే చేరుకున్నారు. అక్కడి నుంచి ఈద్గాకు ర్యాలీగా తరలివెళ్లి ప్రార్థనల్లో పాల్గొన్నారు. అనంతరం ఒకరికొకరు ఆలింగనం చేసుకొని శుభాకాంక్షలు తెలుపుకొన్నారు.

యాడికి: మండల కేంద్రంతో పాటు రాయలచెరువులో ఈద్గాలో శనివారం ముస్లింలు రంజాన్ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. రంజాన్ పండుగను పురస్కరించుకొని ఎస్‌ఐ గురుప్రసాద్ రెడ్డి ఆయా ఈద్గాల వద్దకు వెళ్లి ముస్లింలకు శుభాకాంక్షలు తెలిపారు.

పెద్దపప్పూరు: మండలవ్యాప్తంగా రంజాన్ వేడుకలను ముస్లింలు ఆనందంగా నిర్వహించుకున్నారు. ఈద్గా మైదానంలో ముస్లింలు సామూహిక ప్రార్థనలు చేశారు. ఒకరినొకరు ఆలింగం చేసుకుని రంజాన్ శుభాకాంక్షలు చెప్పుకున్నారు.



పామిడి: సామూహిక ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు



యాడికి: ఈద్గాలో జరిగిన ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్న ముస్లింలు



గుత్తి రూరల్: కొత్తపేటలో ఈద్గా మైదానంలో నమాజ్‌కు వచ్చిన ముస్లింలు



గుత్తి: ఈద్గాలో సామూహిక ప్రార్థనలు నిర్వహిస్తున్న ముస్లిములు



పెద్దవడుగూరు: ఈద్గా వద్దకు ర్యాలీగా వెళ్తున్న ముస్లింలు



నార్పల: రంజాన్ సందర్భంగా ప్రార్థనలు చేస్తున్న దృశ్యం



మర్తాడు: ఈద్గా మైదానంలో ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న దృశ్యం



యల్లనూరు: రంజాన్ సందర్భంగా ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు



బీకేఎస్ : రంజాన్ శుభాకాంక్షలు తెలుపుకుంటున్న ముస్లింలు



పెద్దపప్పూరు: ఈద్గాలో ప్రార్థనలు నిర్వహిస్తున్న దృశ్యం

జగనన్నతోనే రాష్ట్రానికి బంగారు భవిష్యత్



నాగసముద్రం గ్రామంలో జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమం నిర్వహిస్తున్న నాయకులు



కోనుప్పలపాడులో జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

గుంతకల్లు రూరల్: ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పాలన సాగిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే రాష్ట్రానికి బంగారు భవిష్యత్తు సాధ్యమని వైఎస్సార్‌సీపీ నాయకులు అన్నారు. శనివారం మండలంలోని నాగసముద్రం, జి.కొట్టాల, వైటీ.చెరువు, కసాపురం, అమీన్‌పల్లి, గొల్లలదొడ్డి గ్రామాల్లో జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, సచివాలయ కన్వీనర్లు, నాయకులు, కార్యకర్తలు ఇంటింటికీ తిరుగుతూ నవరత్నాల పథకంతో పేద ప్రజలకు ఎంత లబ్ధి చేకూరిందో వివరించారు. అహర్నిశలూ ప్రజల కోసమే పరితపిస్తున్న ముఖ్యమంత్రి జగనన్నను వచ్చే ఎన్నికల్లో ప్రజలు మంచి మనసుతో ఆశీర్వదించాలని కోరారు.

సీఎం జగన్‌తోనే సుపరిపాలన

యాడికి: ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో పాటు తాడిపత్రి ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డిలకు ప్రజలంతా అండగా నిలవాలని వైఎస్సార్‌సీపీ మండల సీజీఎస్ కన్వీనర్ శివప్రసాద్ అన్నారు. సీఎం జగన్‌తోనే సుపరిపాలన సాధ్యమని తెలిపారు. శనివారం మండలంలోని కోనుప్పలపాడు గ్రామంలో వైఎస్సార్ సీపీ నాయకులు కోనా జగదీశ్వరరెడ్డి, కోనా వెంకటశివారెడ్డి, కన్వీనర్లు, గృహ సారథులు, పార్టీ నాయకులు, అభిమానులతో కలిసి జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలో ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరిస్తూ స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో సచివాలయ కన్వీనర్ అనసూయ, కోన కులశేఖర్‌రెడ్డి, నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

బుక్కరాయసముద్రం: ప్రభుత్వం అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలను అందిస్తోందని ఎంపీపీ సునీత పేర్కొన్నారు. శనివారం మండలంలోని కొర్రపాడు గ్రామంలో సచివాలయ కన్వీనర్లు, కో కన్వీనర్లు, గృహ సారథులు, వలంటీర్లతో కలసి జగనే మా భవిష్యత్తు కార్యక్రమం నిర్వహించారు. ముందుగా ఎంపీపీ సునీత లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి సంక్షేమ పథకాలు వస్తున్నాయా లేదా..? ప్రభుత్వంపై మీ స్పందన చెప్పండని వివరాలు తెలుసుకున్నారు. కార్యక్రమంలో సర్పంచ్ కామాక్షి, సచివాలయ మండల కన్వీనర్ బయపరెడ్డి, వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు బుల్లే నారాయణస్వామి, సచివాలయ కన్వీనర్ అక్కులప్ప, జంతలూరు రామ్మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

నెట్టికంటుడి సేవలో ఎమ్మెల్యే శంకరనారాయణ



ఎమ్మెల్యే శంకరనారాయణ దంపతులకు ఆశీర్వచనాలను అందజేస్తున్న అర్చకులు

గుంతకల్లు రూరల్: పెనుకొండ ఎమ్మెల్యే మాలగుండ్ల శంకరనారాయణ శనివారం కుటుంబ సమేతంగా కసాపురం నెట్టికంటి ఆంజనేయ స్వామిని దర్శించుకున్నారు. ఎమ్మెల్యే శంకరనారాయణ దంపతులకు ఆలయ ఈఓ డీ.వెంకటేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో అర్చకులు, వేద పండితులు ఘన స్వాగతం పలికారు. ప్రత్యేక పూజల తర్వాత స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు.

బ్రహ్మోత్సవాల కరపత్రాల విడుదల

ఉరవకొండ రూరల్: మండలంలోని పెన్నహోబిలం లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాల కరపత్రాలను శనివారం ఆలయ ప్రధాన కార్యనిర్వహణాధికారి కె. విజయ్‌కుమార్, అర్చకులు, సిబ్బంది విడుదల చేశారు. మే 2 తేదీ ఉత్సవ మూర్తులు ఆమిద్యాల నుంచి రావడం. 3న ప్రాకారోత్సవం, 4న చంద్రప్రభ వాహనోత్సవం, 5న గోవాహనోత్సవం, శేషవాహనోత్సవం, 6న హంసవాహనోత్సవం, 7న హనుమంతోత్సవం, 8న గరుడవాహనోత్సవం, 9న ఐరావత వాహనోత్సవం ఉంటుందని ఈఓ తెలిపారు. అలాగే 10న మడుగు తేరు, సాయంత్రం దూళోత్సవం. 11న అశ్వవాహనం, 12న ధ్వజ అవరోహణం, శయనోత్సవం 13న ఉత్సవ మూర్తులు పెన్నహోబిలం నుంచి ఆమిద్యాలకు తీసుకువెళ్తారన్నారు. అనంతరం స్వామి పల్లకీ సేవ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు.

కామధేను వాహనంపై శ్రీవారు

బొమ్మనహాళ్: మండల కేంద్రంలోని వేంకటరమణ స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం శ్రీవారు కామధేను వాహనంపై భక్తులకు దర్శనం ఇచ్చారు. ఈ సందర్భంగా ఆలయం భక్తుల గోవింద నామస్మరణతో మార్మోగింది. అశ్వవాహనం పూజకు సహకరించిన భక్తుల ఆధ్వర్యంలో శ్రీనివాసుడికి వేదమంత్రోచ్చారణ మధ్య ప్రత్యేక పూజలు మహామంగళహారతి, తీర్థప్రసాదాల పంపిణీ, దాతలకు సన్మానం కార్యక్రమం నిర్వహించారు. భక్తులు స్వామిని దర్శించుకుని మొక్కులు తీర్చుకొన్నారు.

30న వీరబ్రహ్మేంద్ర స్వామి కల్యాణోత్సవం

గార్లదిన్నె: మండలంలోని యర్రగుంట్లలో గ్రామస్తుల ఆధ్వర్యంలో ఈనెల 30న వీరబ్రహ్మేంద్రస్వామి కల్యాణోత్సవం నిర్వహిస్తున్నారు. శనివారం గ్రామస్తులు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం వైశాఖ మాసంలో వీరబ్రహ్మేంద్ర స్వామి కల్యాణోత్సవం జరిపించడం ఆనవాయితీ అన్నారు. బుధవారం గంగపూజ, గణపూజ, గోపూజ, ధ్వజస్తంభానికి 101 బిందెలతో అభిషేకం, గురువారం ధ్వజస్తంభం ప్రతిష్ఠ, సకలదేవతా హోమాలు, పూర్ణాహుతి, శుక్రవారం పతాక ఆవిష్కరణ, శనివారం గణపతి పూజ, అభిషేకం, ఆదివారం ఉదయం 8:15 గంటలకు కల్యాణం నిర్వహిస్తున్నట్లు గ్రామస్తులు తెలిపారు.

భూసార పరీక్షలు తప్పక చేయించాలి



సదస్సులో మాట్లాడుతున్న కేవీకే ప్రధానశాస్త్రవేత్త డాక్టర్ మల్లేశ్వరి



విద్యార్థులు ఏర్పాటు చేసిన స్టాళ్లను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

- కేవీకే ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ మల్లేశ్వరి
- ఎస్‌బీవీఆర్ కళాశాలలో విద్యార్థులకు అవగాహన సదస్సు

బుక్కరాయసముద్రం: రైతులు పంటలు సాగు చేసే ముందు భూసార పరీక్షలు తప్పని సరిగా చేయించాలని రెడ్డిపల్లి కృషి విజ్ఞాన కేంద్రం కోఆర్డినేటర్, ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ మల్లేశ్వరి సూచించారు. శనివారం క్రిష్ణంరెడ్డిపల్లిలో ఎస్‌బీవీఆర్ అగ్రికల్చర్ విద్యార్థుల ఆధ్వర్యంలో రైతు సదస్సు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కేవీకే ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ మల్లేశ్వరి మాట్లాడుతూ రైతులు భూసార పరీక్షలు చేయించుకోవడం వల్ల ఎరువులు ఎంత మోతాదులో వాడుకోవాలో ముందే తెలుసుకోవచ్చన్నారు. రైతులు పశు సంపదను ఏర్పాటు చేసుకోవాలన్నారు. తద్వారా నిరంతరంగా ఆదాయం పొందొచ్చన్నారు. ఉద్యాన పంటలలో సంబవించే తెగుళ్ల వాటి నివారణ మార్గాలపై అవగాహన కల్పించారు. విద్యార్థులు వ్యవసాయ రంగంపై అవగాహన పెంపొందించుకోవాలన్నారు. అగ్రికల్చర్ కళాశాలలో నేర్చుకున్న వ్యవసాయ విద్యను రైతాంగ అభివృద్ధికి తోడ్పాటు అందించాలన్నారు. కార్యక్రమంలో సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ వెంకటరమణ, కేవీకే శాస్త్రవేత్తలు సతస్య ఉత్పత్తి శాస్త్రవేత్త డాక్టర్ శశికళ, విస్తరణ శాస్త్రవేత్త డాక్టర్ బి.చందన, పశు పోషణ శాస్త్రవేత్త డాక్టర్ మాధవి, డాక్టర్ క్రాంతికుమారి ఎస్‌బీవీ కళాశాల అధికారి క్రాంతి కుమారి, ఉద్యాన శాఖ అధికారి కే చందన విద్యార్థులు రైతులు పాల్గొన్నారు.